క్లుప్తంగా

సీసలిలో న్యాయ విజ్ఞాన సదస్సు



సదస్సుకు హాజరైన కక్షిదారులు

కాళ్ల: సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్యానల్ లాయర్ ఎస్.సుధీర్ అన్నారు. మండలంలోని సీసలి గ్రామంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 9వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నచిన్న సమస్యలపై పంతాలకు పోయి డబ్బు, సమయాన్ని వృధా చేసుకోకుండా ఇరు పార్టీలు సమన్యాయం పొందటానికి లోక్‌అదాలత్ మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో న్యాయవాది డి.రవికిరణ్, ఎస్.నరేష్, పంచాయతీ కార్యదర్శి పద్మావతి, కోర్టు సిబ్బంది శ్రీలక్ష్మి, శశికళ, వలంటీర్లు, పోలీసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

సాక్షి, భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఇరువురు విద్యార్థులకు ఓరుగంటి సుందరి మెరిటోరియస్ అవార్డు కింద ఒక్కొక్కరికి రూ.25వేలు నగదు బహుమతి అందజేశారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అలుమిని అసోసియేషన్‌కు చెందిన వీకే విశ్వనాథరాజు మాట్లాడుతూ అమెరికాలో ఉన్నత స్థానంలో ఉన్న కళాశాల పూర్వ విద్యార్థి ఓరిగంటి శివభరత్ స్కాలర్‌షిప్ ఏర్పాటు చేసి, ప్రతి ఏటా మూడో సంవత్సరం చదువుతున్న అన్ని బ్రాంచ్‌ల్లోని టాపర్స్‌కు నగదు బహుమతి అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఫైనల్ ఇయర్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థిని ఈదర సాత్విక, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విద్యార్థిని దేవులూరి రాజరాజేశ్వరికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు, కేవీ మురళీకృష్ణంరాజు, పి.సుబ్బారావు, వి.చంద్రశేఖర్, ఎస్.ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

22న ఉండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉండి: ఈనెల 22వ తేది మంగళవారం ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏవీ అప్పారావు బుధవారం తెలిపారు. మండలంలో వివిధ శాఖల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరుపై అధికారుల వివరణ, సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

కళాశాల విద్యార్థినులకు యూనిఫామ్ అందజేత



వీరవాసరంలో విద్యార్థినులకు యూనిఫామ్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వీరవాసరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ మహిళా కళాశాల విద్యార్థినులకు బుధవారం యూనిఫామ్‌ను ఉచితంగా అందజేశారు. పాఠశాలలో చదివిన 1984 -85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సుమారు రూ.50 వేలు విలువ గల యూనిఫామ్స్‌ను విద్యార్థులకు బహూకరించారు. గతంలో ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.60 వేలు విలువ గల ఐరన్ గేటును ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులను గ్రామ సర్పంచ్ గెద్దం భారతి, ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో గుబ్బల సత్యనారాయణ, గెద్దం భాస్కరరావు, పోలిశెట్టి సత్యనారాయణ, జవ్వాది దాశరది శ్రీనివాసరావు, షేక్ సత్తార్ సాహెబ్, నార్కెడమిల్లి పెరుమళ్ల గుప్తా, కిషోర్, గుబ్బల రాంప్రసాద్, సుబ్రమణ్య శర్మ, కాయల వీరస్వామి పాల్గొన్నారు.

ఉత్తమ ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవో మురళీ గంగాధర్‌రావును సన్మానిస్తున్న ఎంపీపీ సత్యనారాయణరాజు

పాలకోడేరు: నరసాపురం డివిజనల్ ఉత్తమ ఎంపీడీవోగా జిల్లా కలెక్టర్ నుంచి స్వాతంత్ర్య దినోత్సవం నాడు అవార్డు అందుకున్న పాలకోడేరు ఎంపీడీవో నూకల మురళీ గంగాధర్‌రావును బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. మండల సర్పంచ్‌ల సంఘ కార్యదర్శి బొల్లా శ్రీనివాస్, జంగం సూరిబాబు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటికీ ఆర్థిక భరోసా

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఆకివీడులో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: నవరత్నాలతో పాటు ఇతర సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రతి ఇంటికీ ఆర్థిక భరోసానిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని సచివాలయం-3 ఒకటో వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ఇంటింటికీ వెళ్లిన పీవీఎల్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ రూ.3 లక్షల నుండి రూ.5 లక్షలు పైబడి పథకాల సొమ్ము అందుతుందని వివరించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మరో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పిల్లల భవిష్యత్ బాగుండాలంటే జగన్‌ను గెలిపించాలన్నారు. పాఠశాలలు బాగుండాలంటే జగన్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. పేద, మధ్యతరగతి ప్రజలతో పాటు అన్నివర్గాల ప్రజలకు పథకాలు అందడంతో ఆర్థికంగా వారి పరిస్థితి మెరుగుపడిందని పీవీఎల్ చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం, 108, 104 పథకాలతో పాటు, గ్రామాల్లోనే విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి, ఫ్యామిలీ డాక్టర్‌ను ఇంటికి పంపిస్తున్న ఘనత సీఎం జగన్‌దేనని పీవీఎల్ అన్నారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో కోట్లాది రూపాయలు దోచుకుని, తప్పుడు నిర్మాణాలు చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్లే పోలవరం ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. అధికార దాహం కోసం చంద్రబాబు కూనీకోరుగా మారుతున్నారని, రాష్ట్రంలో మారణ హోమం సృష్టిస్తున్నారని విమర్శించారు. పవన్ చేస్తున్న విమర్శల్లో అర్థం లేదన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థను రద్దు చేస్తానని చెప్పినప్పుడే అతని పరిపాలనా విధానం అర్థమైపోయిందని పీవీఎల్ ఎద్దేవా చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయాలనే యోచన గాంధీజీ ఆశయమన్నారు. అటువంటి గొప్ప వ్యవస్థ ద్వారా ప్రజలకు పరిపాలన చేరువ అవుతుంటే విమర్శలు చేయడం చేతకానితనమన్నారు.

జగన్‌ది గొప్ప పరిపాలన

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లిన సందర్భంలో స్థానిక అందేవారి బోదె వద్ద ఉన్న టీడీపీ నాయకుడు, పంచాయతీ బోర్డు మాజీ సభ్యుడు గంధం ఉమ ఇంటికి వెళ్లిన సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనను ఆయన మెచ్చుకున్నారు. పార్టీతో సంబంధం లేకుండా ఏ విషయమైనా తన సహకారం ఉంటుందని, పథకాలు భేష్‌గా ఉన్నాయని, వికలాంగుడినైన తనకు పింఛన్ వచ్చేలా సహకరించండి అంటూ పీవీఎల్‌కు ఉమ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ నిర్మాణం ఎక్కడా ?

డిప్యూటీ తహసీల్దార్‌ను ప్రశ్నించిన శృంగవృక్షం సర్పంచ్



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ సూరిబాబు

పాలకోడేరు: ఎవరో ముక్కు ముఖం తెలియని వాళ్ళు గ్రామంలో డంపింగ్ యార్డ్ నిర్మాణనికి కోర్టు నుంచి ఆదేశాలు వచ్చాయని చెబుతున్నారని, తనకు తెలియకుండా గ్రామంలో ఎక్కడ డంపింగ్ యార్డ్ నిర్మాణం చేస్తున్నారంటూ శృంగవృక్షం సర్పంచ్ జంగం సూరిబాబు డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ రాజును ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు) అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. పలు శాఖల అధికారులు ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, చేపట్టబోయే పనులను వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ మండలానికి 440 రేషన్ కార్డులు మంజూరయ్యాయని, అలాగే 13 గ్రామాల్లో రీ సర్వే ప్రారంభమైందని, 4 గ్రామాల్లో రీ సర్వే పూర్తయినట్లు చెప్పారు. ఈ క్రమంలో సర్పంచ్ సూరిబాబు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ నిర్మాణానికి స్థలం కోసం తాను అన్వేషిస్తున్నానని, అనువైన కొన్ని స్థలాలను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. గ్రామంలో కొంతమంది ఎవరో కోర్టుకు వెళ్లామని, ఆరు వారాల్లో డంపింగ్ నిర్మాణం చేయాలని అధికారులకు ఆదేశాలు వచ్చాయని పత్రికల్లో చూశామన్నారు. అసలు తనకు తెలియకుండా డంపింగ్ యార్డ్ స్థలం ఎక్కడ ఉందో చెప్పాలని డిప్యూటీ తహసీల్దార్‌ను ఆయన ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, మండల రెవెన్యూ శాఖకు కోర్టు నుంచి నోటీసు అందిందని, అయితే దానిలో డంపింగ్ యార్డ్ నిర్మాణం చేయాలని లేదని, దీనిపై ఆరు వారాల్లో జవాబు ఇవ్వాలని నోటీసులో ఉందన్నారు. తాను సామాన్యమైన సర్పంచ్‌నని సొంత డబ్బుతో రావి చెరువు పనులు చేస్తే డబ్బులు రాలేదన్నారు. రోడ్లు వేస్తే నాణ్యతతో వేయలేదని స్పందనలో ఫిర్యాదు చేస్తున్నారని, అధికారులు కూడా వారి చుట్టే తిరుగుతున్నారని ఆరోపించారు. అధికారులు చేయాల్సిన పనులు సర్పంచ్‌లుగా తాము చేస్తున్నామని మండిపడ్డారు. ఎంపీపీ చంటి రాజు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో మురళీ గంగాధర్‌రావు, వైస్ ఎంపీపీలు నరేష్, ఆదాడ లక్ష్మీతులసి, కో ఆప్షన్ సభ్యురాలు డాక్టర్ డీఆర్ స్వర్ణలత, సర్పంచులు బొల్ల శ్రీనివాస్, కడలి నాగేశ్వరి, ఇంజేటి మరియమ్మ, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విస్సాకోడేరు సర్పంచ్‌కు సత్కారం

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు పొందిన విస్సాకోడేరు సర్పంచ్ బొల్ల శ్రీనివాస్‌ను కో ఆప్షన్ సభ్యులు డాక్టర్ డీఆర్ స్వర్ణలత ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ చంటిరాజు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో, ఎంపీటీసీ సభ్యులు పాల జ్యోతి, నాగలక్ష్మి, శాంతకుమారి, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, పోలయ్య, జార్జ్ ప్రసాద్, వెంకటరాజు, రాజేష్ పాల్గొన్నారు.

భీమవరంలో దీపానికి వందనం

భీమవరం(ప్రకాశంచౌక్): ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ నా భూమి - నా దేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం భీమవరం మున్సిపాల్టీలో దీపానికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పనపూడిలో నిధుల వినియోగంపై విచారణకు డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆకివీడు: సర్పంచ్ పదవిని అడ్డుపెట్టుకుని పంచాయతీలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న సర్పంచ్ ముత్యాల అనురాధ భర్త శ్రీమన్నారాయణ(శివయ్య) ఆగడాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు నంద్యాల సీతారామయ్య మాట్లాడుతూ ఏ పదవి లేకపోయినా శ్రీమన్నారాయణ పంచాయతీ నిధుల వినియోగంలో కలగజేసుకుని దుర్వినియోగానికి పాల్పడుతున్నారని చెప్పారు. గ్రామంలో మట్టి దందా, చెరువుల తవ్వకాలపై డబ్బు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ నాయకులపై అవినీతి ఆరోపణలు చేసే ముందు మీ కుటుంబం జాతకం తెలుసుకోవాలని, తాతల దగ్గర నుండి అవినీతి చరిత్ర ఉందని సీతారామయ్య ఆరోపించారు. మీ సోదరుడు రత్నం డీసీసీబీలో చేసిన అవినీతి పరాకాష్టకు అంతం లేదన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు బంటుమిల్లి పుణ్యవతి మాట్లాడుతూ ఎంపీటీసీ నిధులు రూ.14 లక్షలు తీసుకువచ్చి గ్రామాభివృద్ధికి సహకరిస్తే, ఎస్సీ ఎంపీటీసీనని తనకు గ్రామంలో జరుగుతున్నవి ఏవీ చెప్పడం లేదని, ఎంపీపీ నిధుల వినియోగంలో కూడా అవినీతి జరిగిందని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మెంటే లక్ష్మయ్య మాట్లాడుతూ భార్య సర్పంచ్ పదవిని అడ్డుపెట్టుకుని అక్రమాలు చేస్తున్న ముత్యాల శివయ్య అవినీతి ఆగడాలపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే కుప్పనపూడి పంచాయతీ నిధుల వినియోగంపై డీపీఓ, డీఎల్‌పీఓ విచారణ జరిపేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి మాట్లాడుతూ సీఎం జగన్ పరిపాలనలోనే గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. అవినీతికి రుచి మరిగిన వ్యక్తులు వైఎస్సార్ సీపీ నాయకుల్ని, మాజీ మంత్రి పేర్ని నాని, ఇతర నాయకులపై ఆరోపణలు చేయడం గురివింద గింజ సామెతను గుర్తు చేస్తోందని అన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు మాట్లాడుతూ గ్రామంలో మహిళా సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల విధులకు ఆటంకం కల్గిస్తూ గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు పెత్తనం చేయడం, అరాచకాలకు పాల్పడటం దారుణమైన చర్య అన్నారు. మాజీ మంత్రి పేర్ని నానికి స్వయానా సోదరుడైన శివయ్య ఆయనపైనే బురదజల్లే ఆరోపణలు చేయడం సహించరాని విషయమన్నారు. పంచాయతీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు నంద్యాల యాళ్ల రవికుమార్, బంటుమిల్లి సురేష్ కుమార్, కట్రెడ్డి సత్యనారాయణ, నంద్యాల శివన్నారాయణ, నంద్యాల భాస్కరరావు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బీ రోడ్లకు నిధులు మంజూరు

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వెల్లడి



ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: వీరవాసరం మండలానికి సంబంధించి కీలకమైన ఆర్ అండ్ బీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్ ప్రక్రియ ముగుస్తుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ అధికారులతో బుధవారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీరవాసరం నుంచి మత్స్యపురి వరకు 7 కిలోమీటర్ల మేర రూ.6 కోట్ల నిధులతో రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే వీరవాసరం నుండి నౌడూరు వరకు 6 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వేమవరం నుంచి రాయకుదురు వరకు 4.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం టెండర్ ప్రక్రియ జరుగుతోందన్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ ముగిసి రోడ్ల నిర్మాణ పనులను చేపడతామని ఆయన వెల్లడించారు. అదేవిధంగా మరికొన్ని రోడ్లకు సంబంధించి రూ.20 కోట్ల నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపామని, త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని ఆయన స్పష్టం చేశారు. సమీక్షలో డీఈ రమణ, జేఈ ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించాలి



భీమవరంలో డీఆర్వో కృష్ణవేణికి వినతి పత్రం అందజేస్తున్న వయోవృద్ధుల సంఘ నాయకులు

సాక్షి, భీమవరం: వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించాలని డీఆర్వో కె.కృష్ణవేణికి జిల్లా వృద్ధుల సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అడ్డాల సత్యనారాయణ, కొటికలపూడి చిట్టి వెంకయ్య వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ప్రపంచ వయోవృద్ధుల కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం ఏర్పాటు చేయాలని, వార్షిక ప్రణాళికలో వయోవృద్ధుల సంక్షేమానికి తగిన నిధులు కేటాయించాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని, మండల కేంద్రాల్లో వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భీమవరం ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు నల్లం వెంకటకృష్ణ నాగేశ్వరరావు, బోనం పాండురంగారావు, మేళం దుర్గాప్రసాద్, మట్లపూడి సత్యనారాయణ, కట్రెడ్డి సత్యనారాయణ, ఇంటి లక్ష్మణరావు, చామా సాయిబాబా, చెన్నంశెట్టి గణపతిరావు, తాళ్లపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

అనుభవజ్ఞులుగా పేరు మార్చాలి

ఆకివీడు: వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వృద్ధుల్ని అనుభవజ్ఞులుగా పేరు మార్పు చేయాలని వృద్ధుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య మాట్లాడుతూ కొత్త జిల్లాలు ఏర్పడినందున ఆయా జిల్లాల్లో ఏడీ కార్యాలయాల్ని ఏర్పాటు చేయాలని, వృద్ధుల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి అడవి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు నేరెళ్ల చిన ఆదినారాయణ, సంఘ ప్రతినిధులు వీజే కోటేశ్వరరావు బాబు, పేర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'బడుగు వికాసం' పథకంలో రుణాల మంజూరుకు వినతి



జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాజాను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంగరాజు తదితరులు

సాక్షి, భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా అమలు చేస్తున్న బడుగు వికాసం పథకం నిరుద్యోగులకు ఎంతో ప్రయోజనకరమని, బ్యాంకుల ద్వారా ఎక్కువ మందికి రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దాడిశెట్టి రాజాను కోరినట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ జిల్లా సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి భీమవరం విచ్చేసిన మంత్రికి ఈ మేరకు వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. బడుగు వికాసం పథకం ద్వారా అనేక మంది లబ్ధి పొందుతున్నారని, అయితే జిల్లాలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాల మంజూరుకు మరింత ముందుకు వచ్చేలా చర్యలు తీసుకుంటే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని మంత్రిని కోరినట్లు చెప్పారు. మంత్రిని కలసిన వారిలో పొన్నమండ బాలకృష్ణ, కటికతల రాజారావు ఉన్నారు.

ఏఎంవీఐలకు ఆర్టీవో అభినందనలు



ఏఎంవీఐలు రవి, లక్ష్మిలను అభినందిస్తున్న ఆర్టీవో ఉమామహేశ్వరరావు

భీమవరం (ప్రకాశంచౌక్): ఉత్తమ సేవా పురస్కారాలు పొందిన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు ఎం.రవి, ఎస్.లక్ష్మిలను బుధవారం భీమవరం రవాణా శాఖ కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా శాఖలో ఉత్తమ సేవలందించిన 7గురు ఉద్యోగులు స్వాతంత్ర్య దినోత్సవం నాడు జిల్లా కలెక్టర్ నుంచి అవార్డులు అందుకున్నారని చెప్పారు. పురస్కారాలు పొందిన వారిలో తాడేపల్లిగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డీవీఎస్ఎస్ నాయక్, తణుకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జె.సంజీవన్ కుమార్, భీమవరం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు ఎం.రవి, ఎస్.లక్ష్మి అలాగే భీమవరం హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ మురళీకృష్ణ, తణుకు రవాణా శాఖ సీనియర్ అసిస్టెంట్ ఎస్.గణేష్‌బాబు, భీమవరం హోంగార్డు ఎస్.పరమేశ్వరరావు ఉన్నారని తెలిపారు.

కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు

కాళ్ల: పాత గొడవలు నేపథ్యంలో ఓ వ్యక్తిని కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్ల మండలం సీసలి గ్రామానికి చెందిన తోట భోగేశ్వరరావు రొయ్యల సాగు చేస్తుంటాడు. ఈనెల 13వ తేదీ రాత్రి తన చెరువు వద్ద నుంచి ఇంటికి వస్తున్న సమయంలో పాత గొడవలను పురస్కరించుకుని గ్రామానికి చెందిన నూకల సురేష్ మద్యం సేవించి దారికాచి దాడి చేశాడు. ఈ దాడిలో భోగేశ్వరరావుకు గాయాలయ్యాయి. గాయాలపాలైన భోగేశ్వరరావును అతని సోదరుడు వరప్రసాద్ చికిత్స నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.







